
www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం
18 ఏప్రిల్ 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



## నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### హాజరు కానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి



**కలంజ్యోతి, ఆందోల్:** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం రాయికోడ్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్, నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ కోరారు.



## పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 10వ వార్డు లింగంపేటలో రూ.13 లక్షలతో నిర్మించిన బస్తీ దవాఖాన ప్రారంభించారు. అనంతరం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికల) రూ.10 లక్షలతో నిర్మించిన మరుగు దొడ్ల ను ప్రారంభించి, 8వ వార్డు భవానినగర్ లో రూ.14లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేసి, మెడికల్ హబ్ గా జగిత్యాల మార్చుతానన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక పల్లె దవాఖానా లు జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు అయ్యాయని గుర్తు చేశరు. జగిత్యాల మెడికల్ కాలేజీ, నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్ ఇలా అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ప్రమోద్, కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, జ్యోతి లక్ష్మణ్, శ్రీనివాస్, భారతి రాజయ్య, నవీన్, రాజిరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

## జనాల్లోకి జింక

### కుక్కల దాడిలో గాయం



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** బిజినేపల్లి మండలం కీమ్యా తండా గ్రామ పంచాయతీలోకి దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన జింకను ఊర కుక్కలు వేటాడి గాయపరిచాయని తండావాసులు తెలిపారు. ముందే వేసవి కాలం కావడంతో జింకలకు నీళ్లు దొరకకపోవడంతో జనావాసాలలోకి రావడంతో ఊర కుక్కలు వాటిని వేటాడి చంపిన దాఖలాలు కూడా ఉన్నాయని తండా వాసులు తెలిపారు. ఫారెస్ట్‌లో దాహార్తి తీర్చుకునేందుకు నీరు దొరకకపోవడంతోనే తండాలోకి జింకలు వస్తున్నాయని వారు తెలిపారు. జనావాసాల్లోకి వచ్చిన జింకలను ఊర కుక్కలు వేటాడి గాయపరచడంతో గమనించిన స్థానికులు కుక్కల నుంచి తప్పించారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

## జపాన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

# తెలంగాణకు మారుబెనీ

- రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులకు సంసిద్ధత
- ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు
- టోక్యోలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ఇరుదేశాల అధికారుల సంతకాలు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. జపాన్ కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ రె ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత తెలిపింది. ఆ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని గురువారం టోక్యోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనున్నది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రీయల్ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకున్నది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రీయల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దాంతో దాదాపు రూ.5,000 కోట్లకు పైగా పెట్టుబడును ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రీయల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతున్నది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ చేపడుతారు.

**ఫ్యూచర్ సిటీకి స్వాగతం..**

చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దాంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతున్నదన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరపున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టుబడులకు ముందుకురావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్ కు ఏళ్లకేళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారని సీఎం మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు ముఖమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దై సకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందు వరుసలో ఉంటామని అన్నారు. కాగా మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ మరియు మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 50వేల మందికి పైగా ఉద్యోగులను నియమించింది.

**సోనీ ప్రధాన కార్యాలయం సందర్శన**

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ లో సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోని కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలుసుకుంది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. ఉత్పత్తులతో పాటు వారి పని తీరును తెలంగాణ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్‌పై వివరణాత్మక చర్చలు జరిపింది. యానిమేషన్, వీఎఫ్ఐ మరియు గేమింగ్ రంగాలలో హైదరాబాద్ లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్‌టుఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన భవిష్యత్ విజన్ ను వారితో పంచుకున్నారు.



# భూ భారతితో వివాదాలు దూరం

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్:** భూభారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. గురువారం మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టం ద్వారా ప్రజల భూసంబంధ సమస్యలు భవిష్యత్తులో తలెత్తకుండా ఉంటాయన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్ బుక్ లో భూ మ్యాపింగ్ నమోదవుతుందని తెలిపారు. భూ కమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్టు పేర్కొన్నారు. సీనియర్ ఉన్నత అధికారులు, భూ చట్టాల, న్యాయ నిపుణులు ఎంతో కాలం కసరత్తు చేసిన తర్వాత భూ భారతి చట్టం రూపు దాల్చిందని తెలిపారు. భూ భారతి చట్టంపై అవగాహన కలిగేలా జిల్లా సమాచార పౌర సంబంధాలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సారధి కళాకారులు పాటల రూపంలో నిర్వహించిన కళా జాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ అవగాహనా సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వ్యవసాయ అధికారి సంధ్యారాణి, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

## వరంగల్ కలెక్టర్ సత్యశారద

**కలంజ్యోతి, గీసుగొండ :** రాష్ట్రంలోని భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మండలం కొనాయిమాకుల రైతు వేదిక వద్ద జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని వాడి సమస్యలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు. భూ భారతి ద్వారా రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించనున్నామని వెల్లడించారు. ధరణితో పోల్చితే ఎన్నో రెట్లు మెరుగైన ఫలితాలను అందించబోతున్నదన్నారు. అంతకుముందు భూభారతి చట్టా అవగాహన ర్యాలీ నిర్వహించగా.. కళాకారులు కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో భీమ గాని సౌజన్య, జిల్లా నాయకులు చాడ కొమరారెడ్డి మండల నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ ఆకుల రుద్ర ప్రసాద్, ఇతర గ్రామాల నుంచి కార్యకర్తలు ప్రజలు భారీగా తరలివచ్చారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి

## రైతు భూములకు పూర్తి భరోసా

## జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టమని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం బుగ్గారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని రైతు వేదికల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం 2025 పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో ఎదురైన అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు ఎం.డి. మజీద్, ప్రసాద్, రెవిన్యూ అధికారులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

## ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యానారాయణ

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యానారాయణ పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ప్రమాణ స్వీకారానికి ధన్పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ప్రభంజనం సృష్టిస్తున్నదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కమలం జెండా రెపరెపలాడుతందన్నారు. జిల్లాలో బీజేపీ ఎదుగుదలకు జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, మాజీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు డాక్టర్ రఘు, కన్నం అంజయ్య, వివిధ మండల శాఖ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీ ఉపాధ్యాయురాలీ సస్పెన్షన్



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** నాగనుల్ కేజీబీవీ లో పనిచేసే ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఆర్.కళ్యాణి ని విధుల నుంచి తొలగిస్తూ గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంగ్లీష్ టీచర్ వేధింపులు భరించలేక కేజీబీవీలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో విద్యార్థినులు ఆందోళనలు చేపట్టారు. స్పందించిన కలెక్టర్ విధుల నుంచి టీచర్ ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.




# రైతులకు నష్టపరిహారం పంపిణీ

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ జంతువుల కారణంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారాన్ని ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజ్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా వెల్దండ మండలంలోని సి.రవీందర్ రెడ్డి, గంటల లక్ష్మయ్య, నరసమ్మ, సైదమ్మ, ఊరుకొండ మండలానికి చెందిన బి.ఆంజనేయులు, బి.లక్ష్మయ్య, శ్రీనివాస్ గౌడ్, పి.పద్మలకు అందించారు. వంగూరు మండలానికి చెందిన బయ్య శ్రీనివాసులు, బిజినపల్లి మండలానికి చెందిన కుప్పిరెడ్డి ఉపేందర్ రెడ్డి సహా మొత్తం పది మంది రైతులకు పంపిణీ చేశారు. రూ. 3,12,000 నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజ్ మాట్లాడుతూ.. అటవీ జంతువులు గ్రామాలలోకి లేదా పొలాలలోకి ప్రవేశించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జంతువులకు ఎలాంటి హాని తలపెట్టకూడదని కోరారు. అటవీ జంతువుల వల్ల నష్టం జరిగితే సంబంధిత అటవీ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి నష్టపరిహారం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి చంటి, ఇతర అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లాలోని కన్నెపల్లి ఎస్ఐ గంగారం తెలిపారు. గురువారం కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని పలువురు అనుమానిత ఇండ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు వాడటం వల్ల భూమి సారవంతం కోల్పోయి, రానున్న రోజుల్లో పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. దీని ప్రభావం పర్యావరణం పై చూపే అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాల జోలికి వెళ్లొద్దని సూచించారు.

## మృదులకు గురుకుల సీటు



**కలంజ్యోతి, మంచిర్యాల :** తెలంగాణ గురుకుల 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాలోని కాసీపేట మండల కేంద్రా నికి చెందిన బన్న మృదుల్ మొదటి విడత ఫలితాలలోనే బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీటు సాధించాడు. కాసీపేట గ్రామానికి చెందిన బన్న సంపత్ కుమార్, సంధ్య ల రెండవ కుమారుడైన మృదుల్, కాసీపేట మండల కేంద్రంలోని విస్ డమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రెండవ తరగతి వరకు విద్యను అభ్యసించి, 3,4 తరగతులను అక్షర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివాడు. టీజీ సెట్ 2025లో సీటు సాధించడంతో మృదుల్ ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.



## మహిళల రక్షణే షీ టీం కర్తవ్యం

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఆకతాయిల ఆట కట్టించి, మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం కర్తవ్యమని ఆ డిపార్ట్ మెంట్ సభ్యులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని సత్యం కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులకు షీ టీం ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలపాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, మహిళలకు ఏదైనా సమస్య వస్తే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వచ్చిన ఫిర్యాదు పై తక్షణమే షీ టీం పోలీసులు స్పందించి, సంబంధిత విభాగాలకు సమాచార అందజేయడం ద్వారా ఫిర్యాదు చేసిన మహిళకు షీ టీం బృందాలు సహాయం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ యాజమాన్యం, షీ టీం సభ్యులు, శ్రావణ్, జ్యోతి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్




**కలంజ్యోతి, మంచిర్యాల:** ఎల్ఆర్ఎస్2020 పథకంలో భాగంగా లేఅవుట్ లేని భూముల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల నుంచి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్2020 పథకంలో భాగంగా చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల నుండి ఎల్ఆర్ఎస్ రుసుము వసూలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రుసుము పూర్తి స్థాయిలో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పాత బకాయిలు పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్

**కలంజ్యోతి, మంచిర్యాల:** జిల్లాలో 202425 యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, రైస్ మిల్లర్లు పాత బకాయిలు పూర్తి చేసి బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో వరిధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. సన్న బియ్యంకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తామని వెల్లడించారు. బాయిల్డ్ రైస్ మిల్లర్లకు గతంలో కేటాయించిన ధాన్యం లక్ష్యాలకు సంబంధించి పాత బకాయిలు లేకుండా పూర్తి చేయాలని, బ్యాంక్ గ్యారంటీలు వెంటనే ఇవ్వాలన్నారు.

# పని వేళలు మార్పులో వివక్ష తగదు

### సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత, ఉక్కపోతల దృష్ట్యా కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చడంలో సింగరేణి అధికారులు వివక్ష చూపడం సరికాదని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీటీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఏరియాలోని రామకృష్ణాపూర్ ఏ జోన్ లో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు గంధం రవి అధ్యక్షతన సివిక్ కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, తాగేందుకు చల్లటి మంచినీళ్లు అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సివిక్ కాంటాక్ట్ కార్మికులు అధికారుల, పర్మినెంట్ కార్మికుల కాలనీలను నిత్యం శుభ్రం చేయడంలో కీలక పాత్ర వ్యవహరిస్తున్న, ఆ కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యాలను కాపాడడంలో మాత్రం అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 19 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిల్లల రవీందర్, రాజేందర్, వెంకటేశ్వరరావు, అరుణ్, లక్ష్మీ, శారదలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జయప్రదం చేయండి


### మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**కలంజ్యోతి, మంచిర్యాల :** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ లో నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో ఛలో వరంగల్ బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్ లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రజతోత్సవ మహాసభకు బెల్లంపల్లి నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అరుణ్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, సోషల్ మీడియా, మహిళ నాయకులు పాల్గొన్నారు.

**రజతోత్సవ మహా సభను తరలండి**

**కలంజ్యోతి, మందమర్రి :** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ లో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని టీబీజీకేస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ కోరారు. మహాసభ విజయవంతానికి బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహిస్తున్న ముమ్మర ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని 4వ వార్డు ప్రాణహిత కాలనీలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశానుసారం చెన్నూరు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ డాక్టర్ రాజా రమేష్ నేతృత్వంలో బిఆర్ఎస్ శ్రేణులు చలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు చెన్నూరు నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇన్ ఛార్జ్ తోట సురేందర్, యువజన నాయకుడు బట్టు రాజ్ కుమార్, వార్డ్ అధ్యక్షుడు సట్టు పోషం, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు ఓ రాజశేఖర్, పార్టీ నాయకులు బండారు సూరిబాబు, మద్ది శంకర్, పంజాల ఈశ్వర్, బర్ల సదానందం, తోట రాజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎంపీ, ఎమ్మెల్యేకు వాకర్స్ కృతజ్ఞతలు

**కలంజ్యోతి, మందమర్రి :** వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని అడిగిన వెంటనే, అతి తక్కువ సమయంలో పట్టణంలోని పాత బస్టాండ్ మిని ట్యాంక్ బండ్ పై గల సమస్యలు పరిష్కరించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి పాత బస్టాండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ, పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పైన సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు గతంలో ట్యాంక్ బండ్ ను సందర్శించి ట్యాంక్ బండ్ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజాలింగు కు జారీ చేసిన ఆదేశాల మేరకు మినీ ట్యాంక్ బండ్ పై వాకర్స్ కు అడ్డంగా ఉన్న పెద్ద పెద్ద తుమ్మ చెట్లను తొలగించి, శుభ్రం చేయడం జరిగిందని, అదేవిధంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సెక్యూరిటీ సైతం ఏర్పాటు చేశారన్నారు. దీంతోపాటు పెద్ద మొత్తంలో ట్యాంక్ బండ్ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సమస్యలు పరిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.





# వరి కోతల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**కలంజ్యోతి, మందమర్రి :** రైతులు వరి పంట కోతలు జరిపేటప్పుడు, కోతల అనంతరం నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అప్పుడే మాత్రమే మద్దతు ధర లభిస్తుందని చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏ బానోతు ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని సారంగపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వారి పొలం బాగా ఆరిన తర్వాత మాత్రమే కోతలు చేపట్టాలని సూచించారు. వరి ఆకులు పూర్తిస్థాయి పసుపు, ఎరుపు రంగు కలగలిపిన రంగులోకి మారినప్పుడే బాగా ఆరినట్లుగా గుర్తించి, కోతలు చేపట్టాలని తెలిపారు. పంట కోత కోయు సమయంలో గింజలో తేమ శాతం కేవలం 14 నుంచి 17 శాతం మాత్రమే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారులు కనకరాజు, ముత్యం తిరుపతి, రైతులు ఫిరోజ్, రాయమల్లు, లింగారెడ్డి, గౌస్ లు పాల్గొన్నారు.

# దరఖాస్తుల స్వీకరణ

**కలంజ్యోతి, మంచిర్యాల :** 202526 విద్యా సంవత్సరానికి గాను రెప్యూటెడ్ (కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకానికి అర్హత గల జూనియర్ కళాశాలల నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులకు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు కల్పించనున్నట్టు వెల్లడించారు. ఉన్నత ప్రమాణాలు కలిగి, పోటీ పరీక్షలలో ఎక్కువ సంఖ్య ఉత్తీర్ణతా శాతం కలిగిన రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల కళాశాలలు తమ కళాశాలల 5 సంవత్సరాలకు సంబంధించిన అకడమిక్ ప్రొఫైల్ తో పాటు ఆన్లైన్లో https://telanganaepass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా తమ కళాశాల ఈపాస్ యూజర్ ఐడి, పాస్వర్డ్ తో లాగిన్ అయి ఈ నెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆన్లైన్ ప్రతిని మే 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.



# పంచర్ డబ్బాలో అగ్నిప్రమాదం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపూర్ రోడ్ లో శ్రీనివాస హాస్పిటల్ ముందు పంచర్ డబ్బా లో అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి మంటలను ఆర్పారు పెను ప్రమాదం తప్పింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మేం చెప్పిందే నిజమైంది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**కలంజ్యోతి, హైదరాబాద్ :** హెచ్ సీయూ భూముల విషయంలో సీఎం రేవంత్ చేసిన రూ.10వేల కోట్ల కుంభకోణం మీద తాము చెప్పిందే నిజమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్‌సీయూ భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని తాము వారం రోజుల క్రితమే చెప్పామన్నారు. సుప్రీంకోర్టు సాధికార కమిటీ హెచ్ సీయూ భూములపై ఆర్థిక పరమైన అవకతవకలు, ఉద్దేశపూర్వకంగా చేసిన అరాచక పర్వంపై స్పెషలైజ్డ్ ఏజెన్సీ ద్వారా స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ రూ.10 వేల కోట్ల కుంభకోణం బయటకు రావాలంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆర్బీఐ కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ స్థానంలో మరొకరు ఉంటే సుప్రీంకోర్టు ఆదేశాలతో రాజీనామా చేసేవారని చెప్పారు. రేవంత్ రెడ్డికి సిగ్గు లేదు కాబట్టి దులుపుకొని పోతున్నడన్నారు. హెచ్ సీయూ భూముల కోసం పోరాడిన విద్యార్థులు, సామాజిక వేత్తలకు అభినందనలు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూమి వర్సిటీ ఆధీనంలో ఉన్నదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సాధికార కమిటీ చెప్పిందన్నారు. ఆ భూములపై సుప్రీంకోర్టు చొరవ తీసుకోవాలని సూచించినట్లు కేటీఆర్ వెల్లడించారు.



# మోదీ దిష్టిబొమ్మ దహనం

**కలంజ్యోతి నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణంలో 'నేషనల్ హైరాల్డ్' కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జ్ సీట్ లో నమోదు చేయడానికి నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల భారతదేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడీ పేరుతో దేశంలో ఉన్న అనేక పార్టీలను భయభ్రాంతులకు గురి చేసి బీజేపీ పార్టీ పబ్బం గడుపుకునే పరిస్థితి ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో మోదీకి అమిత్ షాకు బుద్ధి చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, రిజ్వాన్, లలిత నర్సింగ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, ఆంజనేయులు, మల్లేష్, ఉదయ్ కుమార్, రషీద్, చర్ల సందీప్, విజయ్ కుమార్, మనిదిప్, అశోక్ గౌడ్, అజ్మత్, మోహన్ దాస్ గౌడ్, మన్నె శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, మహేష్, సందీప్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# చారిత్రక కట్టడాలకు నష్టం కలిగించొద్దు

## మెట్రో పనుల్లో తీసుకున్న జాగ్రత్తలపై నివేదిక ఇవ్వండి

## ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణలో హైకోర్టు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో -2వ దశ నిర్మాణంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నగరంలోని పాతబస్తీ గుండా నిర్మిస్తున్న మెట్రో మార్గం పనులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. వాదులు, ప్రతివాదుల వాదనలు విన్న కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మెట్రో నిర్మాణాల్లో భాగంగా చారిత్రక కట్టడాలకు ఎలాంటి నష్టం చేయకూడదని వ్యాఖ్యానించింది. పురావస్తుశాఖ గుర్తించిన కట్టడాల వద్ద ఎలాంటి పనులు చేపట్టొద్దని తేల్చి చెప్పింది. ఈ వ్యవహారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలపాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 22కి వాయిదా వేసింది. నగరం అభివృద్ధిలో భాగంగా రవాణా మార్గాలు అవసరమే అయినప్పటికీ.. చారిత్రక కట్టడాలు కూడా అంతే అవసరం అని తెలిపింది.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపర్చుకోవాలి

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కలంజ్యోతి, మల్యాల :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని తెలిపారు. సన్న ధాన్యానికి బోనస్ ను కూడా అందిస్తున్నట్టు గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరే అన్నారని, కాంగ్రెస్ హయాంలో మాత్రం వరికి బోనస్ ను కలిపి ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి, దారం ఆదిరెడ్డి, ముత్యాల రాంలింగారెడ్డి, ముకుంద మల్లేశం, సింగిల్ విండో వైస్ మ్యాక బుజ్జమ్మ లక్ష్మణ్, సంత ప్రకాష్ రెడ్డి,యల్ల అనంత రెడ్డి, విద్యాసాగర్, పాపిరెడ్డి,శేఖర్ రెడ్డి,లక్ష్మణ చారి, మారుతీ, జలందర్,రాయమల్లు, సత్యవతి, స్వామిరెడ్డి,లింగయ్య, కోటేశ్వర్, రవీందర్, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి,తాటిపాముల జగదీశ్వర్, కె శ్రీనివాస్,వీరబత్తిని ప్రతాప్,ప్రసాద్,బట్టు విజయ్, తహసీల్దార్ మునిందర్, ఎంపీవో స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



Cinema
కలంజ్యోతి
శుక్రవారం 18.04.2025

# చైతుతో మీనాక్షి

హీరో అక్కినేని నాగచైతన్య 'తండేల్' సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నది. ప్రస్తుతం ఆయన 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో
ఎన్సీ-24 అనే మూవీలో నటించనున్నాడు. అయితే దీనిని సుకుమార్ రైటింగ్స్ తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు.
ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ మిథికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో చైతన్య మునుపెన్నడూ చేయని డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు.
ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ న్యూస్ నెట్టింట వైరల్‌గా మారింది. నాగ చైతన్య సరసన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా ఫిక్స్ అయినట్లు సమాచారం. అలాగే హీరో, హీరోయిన్స్ మధ్య జరిగే సన్నివేశాలకు సంబంధించిన షూటింగ్ కూడా స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. మరి ఈ ఇద్దరి కాంబోలో మూవీ వస్తుంది అంటే ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతూ ఈ సారి బొమ్మ బ్లాకు బస్టరే అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



